# వారసత్వం

"నాన్నోయ్! అన్నయ్య పాసయ్యాడు! పాసయ్యాడు అన్నయ్య!" అంటూ లలిత తండ్రి మంచం దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చింది.

మంచం పట్టెమీద చేతులానించి, ముందుకు వంగి వచ్చే దగ్గుతెర ఆపుకుంటూ కూర్చున్న శేషయ్య తల పైకెత్తి చూశాడు.

విశ్వనాథం, వికసించిన వదనంతో ఒక చేత్తో దినపత్రిక పట్టుకొని లలిత వెనకే లోపలికొచ్చాడు. దేశాలు జయించిన విజయగర్వంతో తండ్రిముందు కొచ్చి నుంచున్నాడు విశ్వనాథం.

ఎక్కడో అగాథంలోకి పీక్కుపోయిన శేషయ్య కళ్లలో కాంతి గాలివాన రాత్రి చీకటి మబ్బుల్లో మెరసే మెరుపులా తళుక్కుమంది.

పొంగివస్తోన్న ఆనందోద్వేగాన్ని, బయటికి దూకటానికి ప్రయత్నిస్తోన్న దగ్గు తెరతో పాటు అణుచుకొంటూ—

"మరి క్లాసు వచ్చిందా?" అని ప్రశ్నార్థకంగా కనుబొమలు ముడివేశాడు శేషయ్య.

"ఫస్టు క్లాస్‌లో పాసయాను నాన్నా! ఫస్టుక్లాసులో!!" అంటూ విశ్వనాథం తండ్రి చేతికి పత్రిక ఇచ్చాడు.

"నా బాబే! నా బాబే! ఫస్టున పాసయావటరా! నా కష్టాలు తీరే రోజు లొచ్చినయ్‌లే నాయనా!" పవిట చెంగుకు మసి చేతులు తుడుచుకొంటూ విశ్వనాథం తల్లి రామసుబ్బమ్మ వంటింట్లోనుంచి వచ్చింది. శేషయ్య పత్రిక తీసుకుని కొడుకు నంబరు వెతుకుతూంటే, యిక ఆగలేనంటూ దగ్గు తెర ముందుకువచ్చింది.

ఖంగ్ ఖంగ్‌న ఒకటే దగ్గు! ఊపిరి సలపని దగ్గు!

తండ్రి వళ్లోవున్న పత్రిక పక్కకు పెట్టి విశ్వనాథం, తండ్రి భుజం అనుకుని వెన్ను నిమిరాడు.

రామసుబ్బమ్మ మట్టిబొచ్చెలో ఇంత బూడిద వేసుకొని శేషయ్య ముందు పెట్టింది.

శేషయ్య ఖంగ్ ఖంగ్‌న దగ్గి ఖళ్లు ఖళ్లున ఖాండ్రించి ఊశాడు. తెల్లటి నురుగులో ఎర్ర డాగులు!

"రక్తం కూడా పడుతోంది!" రామసుబ్బమ్మ గుండెలు అవిసిపోయినై. భయం భయంగా భర్త ముఖంలోకి చూచింది.

శేషయ్య ముఖం పక్కకు తిప్పుకున్నాడు. లోతుకుపోయిన కనిగుంటలనిండా నీళ్ళు! ఎండిపోయిన చెక్కిళ్లమీదగా కిందకు జారాయి.

తనకు తెలుసు, తనలోపల ఏం జరుగుతుందో; తన రక్తాన్ని జుర్రుకుంటూ లోపల వొక రాక్షసి పెరుగుతోంది. తిరుగుతోంది. రాక్షసి వొక్కొక్క బొట్టే రక్తాన్ని తన హృదయ కోశంలోంచి పీల్చుకొంటోంది. ఆ రాక్షసి - రోగం - పేరేమిటో శేషయ్యకు తెలుసు. డబ్బు ప్రవాహంలాగా ఖర్చు పెడితే ఆ రాక్షసిని మేపుతూ మనిషి బ్రతకొచ్చు! లేకపోతే అదిరక్తాన్ని పీల్చుకొంటుంది. మనిషిని తినేస్తుంది. ఇంతకీ తనలాంటి - శేషయ్యలకు రావాల్సింది కాదు ఆ జబ్బు! వస్తే—?

వనశ్రీ

తన గుండెలమీద కూర్చున్న మృత్యువుని పసికట్టాడు శేషయ్య. ఏదో ఒక్క క్షణం ఏమరుపాటు! గుండెగొట్టుకోవడం మానేస్తే? మృత్యువు శాశ్వతంగా తన్ను వశపరచుకొంటుంది!

గుండెల్లోపోటు! శేషయ్య కింద పెదవి పళ్లసందున బాధతో నలిగి పోతూంది.

"అబ్బ! కాసిని మంచినీళ్లు!" అన్నాడు శేషయ్య.

"అమ్మాయ్‌లలితా! నాన్నకు మంచినీళ్లు తీసుకురా!" అంటూ రామసుబ్బమ్మ పక్కకు చూచింది.

లలిత ఎప్పుడో వెళ్లిపోయింది! అన్నయ్య ఫస్టున పాసైన సంగతి ఆ చుట్టుపక్క ఇళ్లల్లో చాటింపు వేసి రావడానికి.

ఆమె లేచి వెళ్లి మంచినీళ్లు తీసుకొచ్చింది. శేషయ్య నీళ్లు తాగి కొంత తెప్పరిల్లాడు.

విశ్వనాథం తండ్రి ముఖంలోకి ఆదుర్దాగా చూస్తూ మంచం పక్కనే కూర్చున్నాడు.

"మరేదన్నా ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టుకో!" అన్నాడు తండ్రి.

"ఉద్యోగానికా?" విశ్వనాథం హృదయంలోని ఆశాసౌధాల పునాదులు కదిలిపోయినై.

"మరి ఏదో వొకటి చూచుకోకపోతే ఎలా?" అన్నాడు శేషయ్య ముఖం పక్కకు తిప్పుకొని; గొంతులో దుఃఖం గరగరలాడింది.

"మెడిసిన్ చదువుతా! అందుకేగా సైన్సు గ్రూప్ తీసుకొంది. క్లాసుకూడా వచ్చింది. సీటు దొరకొచ్చు!" అన్నాడు విశ్వనాథం.

"సీటు దొరికితే డబ్బు దొరకొద్దూ_" తర్వాతి మాటలు దగ్గుతెరలో కలిసిపోయినై.

"ఆ యకరం పొలం అమ్మితే సరి! ఏమైనా మెడిసన్ చదవాల్సిందే!" అంటూ విశ్వనాథం బయటికి లేచిపోయాడు.

"అంతగాక మరేవిటి? ఆ బారెడు నేలా వుండి మన్ని వుద్ధరిస్తుందా? కష్టపడి చదువుకొని వాడు డాక్టరైతే ఇక మనకు కావాల్సిందేముంటుంది?" శేషయ్య ముఖంమీద స్వేద బిందువుల్ని పవిటచెంగుతో తుడుస్తూ అన్నది రామసుబ్బమ్మ.

"అది కాకే పిచ్చిదానా-?" మళ్ళీ శేషయ్యకు దగ్గుతెర కమ్ముకొచ్చింది.

శేషయ్య ముప్ఫై సంవత్సరాలు గుమస్తాగిరి చేసి రిటైరయినాడు. తాలూకా ఆఫీసులో హెడ్ గుమస్తాగా చేస్తోండగా శేషయ్యకు ఏభై ఐదో సంవత్సరం పూర్తి కావడంతో ప్రభుత్వం అతన్ని రిటైర్ అవమని ఆదేశించింది.

శరీరంలో జవసత్త్వాలు ఉడిగిపోయినాక, తోలుసంచిలో కట్టిన ఆ యెముకల మూట మా కెందుకూ, ఇక నువ్వు ఇంటికి పోయి విశ్రాంతి తీసుకోవచ్చు అన్నది సర్వీసు రూల్సు తాలూకు అధికార స్వరం.

ఉడుకు నెత్తురూ, వయసూ, వలపూ గుమస్తాగిరికి ధారపోసి వట్టి ఎముకలపోగు శరీరాన్ని ఇంటికి తెచ్చుకున్నాడు శేషయ్య.


ప్రసిద్ధమైన నంజనగూడు పండ్లపొడి వారి
అగత్యమైన కుటుంబ ఔషధములు
కాస్మస్ — కస్తూరి మాత్రలు...సీసా 0-6-0
కర్జక — గోరోజన మాత్రలు... 0-8-0
బాలక్స — విరేచనముగుటకు మాత్రలు... 0-6-0
మా మందుల పూర్తి జాబితాకు వ్రాయుడు
యునైటెడ్ కన్సర్న్, బందరు వీధి, మద్రాసు-1. విజయవాడ.

# ★ వారసత్వం ★

శరీరాన్నయితే ఆమాత్రమైనా తనకు మిగిల్చుకోగలిగిన శేషయ్య, ఆత్మాభిమానాన్ని ఆఫీసు ఫైల్సులోను అధికారుల బూట్లకిందా వదిలేసి చక్కా ఇంటికి వచ్చాడు. ప్రభుత్వం శేషయ్యకు నెలకు ఏభైనాలుగు రూపాయల పింఛను ఇస్తోంది.

శేషయ్య తన ముప్ఫైఏళ్ళ సర్వీసులో దేశంలో జరిగిన చాలా మార్పుల్ని చూశాడు. స్వాతంత్ర్య పోరాటాలు, బ్రిటిష్ ప్రభుత్వ లాఠీలూ, బాయినెట్లూ, జైళ్ళూ, తెల్లవాడుపోయి నల్లవాడు అధికారంలోకి రావడం చూశాడు.

దేశంలో ఎన్నిమార్పులు జరిగినా ప్రభుత్వానికి నమ్మకస్తుడుగా వున్న శేషయ్యలో గాని, అతను చేసిన గుమాస్తా గిరి విధుల్లో గాని ఏమార్పూ రాలేదు.

ముగ్గురు పిల్లల్నీ, పెళ్ళాన్నీ పోషించుకొంటూ, అడపాదడపా వచ్చిన పై సంపాదన వెనకేసుకొని రెండెకరాల పొలంకూడా కొనుక్కున్నాడు శేషయ్య.

శేషయ్య రిటైరయిన రెండో సంవత్సరంలోనే విశ్వనాథం స్కూలుఫైనలు పాసవడమూ, లలిత హైస్కూల్లో ఫోర్తుఫారంలో చేరడమూ, దాంతోపాటు కుటుంబ ఖర్చులు పెరగడమూ, జరిగింది.

ఉన్న రెండెకరాల్లో ఒక ఎకరం పొలం అమ్మి కొడుకును కాలేజీలో చదివించాడు. తన కొచ్చే పెన్షన్ ఏభై నాలుగు రూపాయిలతో సంసారం గడుపుకు వస్తోంటే, పొలం అమ్మిన డబ్బుతో విశ్వనాథాన్ని డాక్టరు పరీక్ష చేయిస్తే తన జన్మకు వో అర్థం వుంటుందనుకొన్నాడు శేషయ్య.

శేషయ్య ప్రతిరోజూ కొడుక్కు 'డాక్టరు' గురించిన ఆశల్తో ఉత్సాహపరచి పట్టుదలతో చదివించి పరీక్ష పాసయ్యేట్టు చూశాడు.

విశ్వనాథం ఇంటర్ పాసయ్యేసరికి, శేషయ్య వెనకేసిన సొమ్మూ, పొలం అమ్మిన డబ్బూ, పూర్తిగా అయిపోయింది. దానికి తోడు శేషయ్య మంచాన పడటంతో ఇల్లూ వళ్లూ గుల్లయిపోయింది. ఇప్పుడు మందులు కొనే వోపిక కూడా లేక వట్టి చేతులతో మృత్యువుతో పోరాడడం మొదలు పెట్టాడు.

తనకు వచ్చే పింఛన్ బాపతు సొమ్మే పొయ్యిలో పిల్లి లేవడానికి ఆధారం. తను ఏ నిముషాన కన్ను మూస్తే ఆ నిముషం నించీ ఆ ఆధారం కాస్తా పుటుక్కున తెగిపోతుంది. తర్వాత పెళ్లాం బిడ్డల సంగతి ఏం కాను? ఈ లోపలే విశ్వనాథాన్ని ఏదో గుమస్తా గిరిలో ప్రవేశపెట్టే సంసారాన్ని ఎలాగో అలా యీదుకొస్తాడు.

కాని వాడు అవున్న ఎకరమూ అమ్మేసి చదువుతానంటాడు! అందులో వాడి తప్పు మాత్రం ఏముంది? సైన్సు గ్రూపు ఫస్టు క్లాసులో వచ్చాడు. తెలివితేటలు వున్నవాడు. అవకాశం వుండి చదువుకుంటే పెద్ద డాక్టరవుతాడు. మొదట్నుంచీ ఆ ఆశలు వాడిలో రెచ్చగొట్టింది తనే! తను ఆశించినట్టే వాడు కష్టపడి చదివి క్లాసు తెచ్చుకున్నాడు. 'మెడిసిన్' సీటు వచ్చాక రెండు సంవత్సరాలు చదివిస్తే, ఎవరో ఒకరు మంచి కట్నమిచ్చి పిల్లను ఇస్తారు. అత్తవారే మిగతా నాలుగు సంవత్సరాలు చదివించుకొంటారు. వాడు డాక్టరయి నాలుగురాళ్లు సంపాదించుకుంటే చెల్లెలికీ, తమ్ముడికీ వొకదారి చూపించగలుగుతాడు. అదీ ఇంత వేళకు తిని కృష్ణా రామా అంటూ కూర్చుంటుంది. ఇక తను నిశ్చింతగా కళ్లుమూసుకోవచ్చు! అందాకా తను బతికుంటే తన కొడుకు-డాక్టరు - తన జబ్బును నిముషాలమీద నయం చేయడూ?

—శేషయ్య మనసు రెక్కలు విప్పుకొని భావతరంగాలలో విహరించింది.

"ఏమండీ? అబ్బాయిని చదివించొద్దా?" మెల్లగా అన్నది భార్య విసురుతోన్న విసనకర్ర ఆపి.

పసిడి రెక్కలు విప్పుకొని వినీల ఆకాశంలో విహరిస్తోన్న శేషయ్య మనసు, నులకమంచంమీద కొచ్చింది. మంచం పట్టె వగుల్లోనుంచి నల్లి శేషయ్య తొడను తెగ పొడిచింది. "అబ్బా" అంటూ కాలు కదిలించి భార్య ముఖంలోకి చూశాడు.

భార్య కళ్లల్లో అదే ప్రశ్న! ఆమె కనుపాపల నీడలలో విశ్వనాథం మెళ్లో స్టెతెస్కోప్ పెట్టుకొని మెదులుతూన్నట్టుగా భావించాడు శేషయ్య.

"వాడు వృద్ధిలోకి రావడం నాకుమాత్రం ఇష్టంలేదా? నువ్వే ఆలోచించు, ఆ కాస్త చెక్కా అమ్మితే ఏమైపోతావో బాగా ఆలోచించుకో?" అన్నాడు శేషయ్య.

"ఏమైపోయినా సరే! నా కొడుకు డాక్టరయితే నాకు అంతకంటే కావాల్సిందేముంది? మీకు వచ్చే పింఛను డబ్బుతో ఎలాగో సంసారాన్ని దిద్దుకొస్తాను. పొలం అమ్మితే వాడికి రెండు సంవత్సరాలకన్నా చదువుకొస్తుంది! ఆ తర్వాత మేం ఇస్తామంటే మేం ఇస్తామంటూ వాడి కాళ్లచుట్టూ తిరగరూ? అసలు అబ్బాయి అదృష్ట జాతకుడు! వాడి ఐశ్వర్యమంతా ఎవరు చూడాలి?"

ఎండిపోయిన శేషయ్య పెదవులపై చిరునవ్వు కెరటంలా పొంగి వాలిపోయింది.

అవును! తన కొడుకు అదృష్ట జాతకుడే నేమో! ఎవరు చూశారు? వారాలు తిని చదువుకున్న వాళ్లల్లో ఒకడు జిల్లా కలెక్టరయిన సంగతి తనకు తెలుసు! వీధి లాంతరు స్తంభం వెలుగులో చదువుకొని ఒకడు హైకోర్టు జడ్జి అవడం తను చూశాడు! విశ్వనాథంలోవున్న ప్రతిభ తనకు తెలుసు! ఏదో వొకరోజు పెద్ద సర్జన్ అయిపోతాడు. బీదవాళ్ళకు ఉచితంగా వైద్యం చేసి దేశవ్యాపితమైన కీర్తిని సంపాదిస్తాడు.

—శేషయ్య. భావనా ప్రపంచంలో జనరల్ హాస్పిటల్ గేటుముందున్న డాక్టర్ రంగాచారి విగ్రహం కదిలింది. దాన్ని తను కొన్ని వందల సార్లు చూసి వుంటాడు. కాని ఈరోజు శేషయ్య మనసులో ఎంతో ఉదాత్తంగా, గంభీరంగా కనిపిస్తోంది.

శేషయ్యకు కళ్లు మసకలు కమ్ముతూన్నట్టుగా వుంది. డాక్టర్ రంగాచారి విగ్రహం సినిమాలో బొమ్మలా 'ఫేడవుట్' అయిపోతూంది. మళ్లీ 'ఫేడిన్' అవుతూంది విగ్రహం! ఆ విగ్రహంలో విశ్వనాథం ముఖకవళికలూ, వర్చస్సూ—

—శేషయ్యకు గుండె పోటూ దానింబటే దగ్గు తెరా వచ్చిపడినై.

దగ్గు తెర అణిగి స్పృహ వచ్చేసరికి తండ్రికి ఎదురుగా దీనవదనంతో విశ్వనాథం నుంచొని వున్నాడు.

"బాబూ!" అన్నాడు శేషయ్య కొడుకు ముఖంలోకి చూస్తో.

"నాన్నా! ఎలా వుంది?" తండ్రికి దగ్గరగా జరిగి అన్నాడు విశ్వనాథం.

కొడుకు జుట్టులోకి వేళ్లు పోనిచ్చి నిమురుతూ - "విశ్వం! ఎంత కష్టపడైనా డాక్టరు కోర్సు పూర్తిచేసుకో నాయనా! రేపే రాసి అప్లికేషన్ ఫారం తెప్పించుకో!" అన్నాడు శేషయ్య.

విశ్వనాథం కళ్లు చెమ్మగిల్లాయి.

## 2

జూన్ నెల రెండవ వారం మొదట్లో పత్రికల్లో ప్రకటనలు పరంపరగా రాసాగాయి. విశ్వనాథం ఎం.బి; బి.యస్; కోర్సుకు అప్లికేషన్ ఫారము పంపమని యూనివర్సిటీకి రాయాలని అనుకున్నాడు. అర్థరూపాయి పంపితేకాని ఫారం పంపరు! ఇంట్లో అన్నిటికీ కటకటగా వుంది. ఫారం తెప్పించడానికే రూపాయి యివ్వమని నాన్నని అప్పుడే అడగడం ఏం బావుంటుంది?

విశ్వనాథం, తన క్లాస్ మేట్, స్నేహితుడూ అయిన సత్యనారాయణకి సంగతి చెప్పి ఒక రూపాయి బదులివ్వమని అడిగాడు.

అప్లికేషన్ ఫారం తెప్పించుకోవడానికి రూపాయికి తికాణా లేని వాడివి

...సెంటి, బి.యస్., కొన్ను ఎలా చదువుతా వోయ్!" అంటూ వెకిలిగా నవ్వాడు.

విశ్వనాథం హృదయంలో బాకు గుచ్చినట్టయింది! సత్యనారాయణ తన హృదయాన్ని గాయపరచాడు. ఏదో క్రూరమైన నిజాన్ని తన కళ్లముందుకు లాగి చూపించాడు!

ఫస్టు క్లాసులో పాసయిన తనకు, ఏ పార్టూ పాసుకాని సత్యనారాయణ ఎంత తెలివిగా చెప్పాడు! తన మధుర స్వప్నాలపై నున్న తెరను ఎంత నిర్దయగా లాగి వేశాడు. వాస్తవం అంత కఠినమా? నిజం దయారహితమా?

బాగా చీకటి పడ్డాక విశ్వనాథం ఇంటికి వచ్చాడు. సత్యనారాయణమాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. అలమారులో వున్న పుస్తకాలు చిందరవందరగా విసరికొట్టాడు. లాంతరు గుడ్డి వెలుగులో పుస్తకాల మధ్యన తళుక్కున మెరుపు కనిపించింది!

ఆ మెరుపును మెల్లగా తీసి చేత్తో పట్టుకున్నాడు!

వెండి మెడల్! విశ్వనాథం ప్రతిభా, తెలివితేటలకు చిహ్నం! స్కూలు ఫైనల్ పరీక్షలో స్కూల్లో అందరికంటే ఎక్కువ టోటల్ వచ్చినందుకు మెడల్ ఇచ్చారు.

విశ్వనాథం మెదడులో ఒక వూహ మెరిసింది. కూలిపోయిన ఊహాసౌధాలు అతని హృదయంలో మళ్ళీ లేచి నుంచున్నాయి.

తెల్లవారి ఎవరికీ చెప్పకుండాపోయి షరాబు అంగడిలో వెండి మెడల్ అమ్మి వేశాడు. మూడు రూపాయిలు వచ్చినయ్. అర్ధరూపాయి మనిఆర్డరు పంపుతూ యూనివర్సిటీకి అప్లికేషన్ ఫారం పంపమని రాశాడు.

మిగతా దాన్లో ముప్పావలా పెట్టి నాలుగు బత్తాయిపళ్లు కొనుక్కొని, రోగిష్టి తండ్రికి తీసుకుపోయాడు.

నాలుగు రోజుల తర్వాత విశ్వనాథానికి యూనివర్సిటీనుండి వుత్తరం వచ్చింది. గ్రూప్‌లో 'డిస్టింక్షన్' వచ్చిందని తెలియజేశారు.

విశ్వనాథం తండ్రి దగ్గరకు వుత్తరం తీసుకొని పరుగెత్తిపోయి చూపించాడు. శేషయ్య ఆనందపరవశుడయిపోయాడు. ఉత్సాహం పట్టలేక అన్నయ్య వీపుమీద చరిచింది లలిత.

"నా కష్టాలు తీరేరోజులు వచ్చినయ్‌రా నాయనా?" అన్నది రామసుబ్బమ్మ. ఆమెకు అదో అలవాటు పాపం! సంతోషకరమైన వార్త విన్నప్పుడెల్లా ఆమెకు బుర్ర పని చేయక ఆమాట అంటూ వుంటుంది.

"ఐతే సీటు తప్పకుండా దొరుకుతుంది! ఏమైనా సరే, ఎన్ని అవాంతరాలు వచ్చినా సరే నువు కష్టపడి చదువు నాయనా!" అన్నాడు శేషయ్య. శేషయ్య కన్నకొడుకు ముఖంలో డాక్టరు రంగాచారి విగ్రహం నీడలు కదులుతున్నట్టుగా కనిపించింది. "అలాగే నాన్నా!" అన్నాడు విశ్వనాథం.

"నా బాబు చిటికలో డాక్టరు పరీక్ష యిచ్చెయ్యడూ! స్కూలు మొత్తంమీద ఫస్టుగా వచ్చినవాడికి అదో లెక్కా పత్రమా?" అన్నది రామసుబ్బమ్మ అతని తిస్తో చిటిక వేసి.

## 3

వారం రోజుల తర్వాత పోకనాడు పేరయ్యగారు మట్టం మాపుగా శేషయ్య ఇంటికి వచ్చాడు. కుశల ప్రశ్నలు అయ్యాక పేరయ్య అన్నాడు.

"మరి విశ్వం పరీక్షఅయినాడు కాతాలి! ఏదైనా వుద్యోగంలో పడేయకపోయావా? నాలుగురాళ్లు తెస్తే వేడినీళ్లకు చన్నీళ్లలా కుటుంబం గడిచిపోతుందిగా?"

"అదేవిటిబావా? వాడు డాక్టరుకోర్సు చదవాలనుకుంటుంటేను!" అన్నాడు శేషయ్య. గొంతులో గర్వం గీరపలికింది.

"ఆఁ. అనుకోటానికేమిలే? రాజుగారి కూతుర్ని చేసుకోవాలనుకోవచ్చు! దానికి తాహతుండొద్దూ? మన అంతరాన్నిబట్టి మనకోరికలూ వుండాలి! దూకలేకపోతే మోకాళ్లు విరుగుతయ్. తర్వాత ఏం అనుకుంటే ఏంలాభం!"

శేషయ్య మనసు బాగా వుబ్బించిన రబ్బరు బెలూన్‌లోనుంచి గాలిపోయిన చందమైంది.

"బుద్ధులు భూము లేలుతుంటే రాతలు గాడిదలు కాస్తున్నాయని మనకెందుకు యీ అందనిపనులూ! నీమాదిరిగానే వాడూ ఏ తాలూకాఆఫీసులోనో గుమస్తా గిరి దొరికితే హాయిగా బతికిపోతాడు!"

"చెయ్యక చెయ్యక వాడిచేతగూడా గుమస్తాగిరి చేయించాలా?"

"అవును శేషయ్యబావా! వారసత్వం ఎక్కడికిపోతుంది?" - పేరయ్య మీసాల్లోంచి విషపునవ్వు నాగుపాములా కదిలి మాయమైంది.

"వారసత్వం! గుమస్తాగిరి వారసత్వం!"- శేషయ్య పెదవులు వణికాయి. తన ముప్పై సంవత్సరాల గుమాస్తా జీవితం కళ్లముందు కదిలింది--.

గడియారంలో ముల్లు - ఎనిమిదినుండి మళ్లీ ఎనిమిది అంకెమీదకు - డ్రాఫ్టీఫైల్, నోటుఫైల్, పేపర్సు పెన్‌డింగ్ పెండింగ్ - "ఆఫీసర్ పిలుస్తున్నారు సర్" - కాలింగ్ బెల్ - "వస్తున్నా సార్" - "ఏమిటి లా రాశావ్?" కాళ్ళల్లో వణుకు - నోట్లో నుంచి మాటరాదు. "యూ హేవ్ నో బ్రెయిన్స - అన్‌ఫిట్ -" "యక్స్‌క్యూజ్ మీ సార్ -" "[illegible] ట్లు వస్తున్నాయ్ - [illegible] -" "చిత్తం చిత్తం - పిల్లలుగలవాణ్ని - క్షమించండి -" "నో - నో" - "చిత్తం - చిత్తం - యువర్ మోస్ట్ ఒబీడియంట్ సర్వెన్‌సార్" ఆఫీసర్ రూంలోనుంచి చేతులుకూడా కాళ్ళకాగా-నాలుక్కాళ్ళ మీద పాకిబయటపడటం—

గుండెల్లో రైళ్ల దప్పుడూ - [illegible] చేటూ - హారిబుల్! ఫైల్స్! ఫైల్స్! పెండింగ్-పెండింగ్-

—శేషయ్య కళ్లంతా చెమటలు కక్కుతోంది. నగ్నతెర ముంచుకొచ్చింది.

నగ్నతెర అణిగాక శేషయ్య స్థిమితంగా కూచున్నాడు నీరసంగా చూస్తూ.

"సరే! బావా? ఆ ము[illegible] మెప్పుడో మాని మూడు ముళ్ళూ వేస్తే మనపని తీరిపోతుందిగా?" అసలు సంగతి బయటపెట్టాడు పేరయ్య. తన కూతుర్ని విశ్వనాథానికే యిచ్చిచేయాలన్న అభిప్రాయంలో వున్న పేరయ్యకు విశ్వనాథం డాక్టరు కోర్సుకు పోతే తన కూతుర్ని చేసుకోడేమోనని భయం.

"వాడికిప్పుడేం పెళ్ళి? చదువు పూర్తి అయ్యాక డాక్టరు అయి చేసుకొంటాడు" అన్నది రామసుబ్బమ్మ అప్పుడే లోపలకు వస్తూ.

"అంతే! పేరయ్య బావా!" అన్నాడు శేషయ్య.

పేరయ్య బావ ఘూంఘాలాడుతూ లేచి నుంచున్నాడు.


"ఓస్! ఇట్లాంటివి చాలా చూశానులే! గుమాస్తా కొడుకు కలక్టరై ఊళ్లు ఏలతాడుట చూద్దాం! పూటకూటికి గతిలేదు యీయనకు పెద్దచదువులు చదివించి కొడుకుని అందలాలు ఎక్కిస్తాడట! అంతా యీ కళ్లతోనే చూస్తాగా?" అంటూ పేరయ్య చరచరా వెళ్ళిపోయాడు.

శేషయ్య గుండెల్లో ఏదో తెమిలినట్లయింది! పేరయ్య మాటల్లో ఏదో దారుణమైన సత్యం వున్నది. అది శేషయ్య మనసును కలచివేసింది.

శేషయ్య స్వప్న జగత్తు కరిగిపోతోంది. డాక్టరు రంగాచారి స్టాట్యూ- విశ్వనాథం భవిష్యత్తు - ఇసుక్క, మట్టి, సున్నంగా విడిపోయి రాలిపోతోంది.

"లేదు! విశ్వనాథం గుమస్తా కావడానికి వీలులేదు! డాక్టరవాలి! డాక్టర్ రంగాచారి డాక్టర్ విశ్వనాథం! డాక్టర్ విశ్వనాథం—"

"ఒరే! అబ్బాయ్! తొందరగా రారా నాయనా! మీనాయనకు మతిపోయినట్టుంది వెర్రిగా అరుస్తున్నారు!" అంటూ కేకలు పెట్టింది రామసుబ్బమ్మ.



బందరులో ఇటీవల కూచిపూడి నాట్యం చేసిన కిళాంబి రాజకుమారి, వేదాంతం లక్ష్మీ నారాయణగారు, బరోడా విశ్వవిద్యాలయ నాట్యాచార్యుడు మోహన్ ఖోకర్.

# ★ వారసత్వం ★

శేషయ్య వెర్రిగా చూస్తూ స్పృహతప్పి పడిపోయాడు.

## 4

"అప్లికేషన్ ఫారం యివ్వాళే పంపాలి నాన్నా! యీరోజే లాస్టు డేట్!" అన్నాడు విశ్వనాథం.

"మరి రామయ్యగార్ని అడక్కపోయావూ? రేపో ఎల్లుండో పెన్షన్ రాగానే యిచ్చే పని!" అన్నాడు శేషయ్య కుడి చేత్తో ఎడమపక్క గుండెను అదుముకుంటూ.

"అదీ అయింది! లేదన్నాడు."

"ఆయనగారి దగ్గర పదిరూపాయలు కూడా లేవన్నాడా? చూస్తే కోటికి పడగ ఎత్తాడు! నిజంగా వీళ్ళదగ్గర లేకుండా ఎప్పుడు పోతుందో?" అన్నది రామ సుబ్బమ్మ కసి, విచారమూ ఆమె గొంతులో పోరుచుకున్నై.

"ఇవ్వకపోతే మానె! పైగా మాటలు!" అన్నాడు విశ్వనాథం కోపంగా.

"ఏమన్నాడేం?" తీవ్రంగా చూస్తూ అడిగాడు తండ్రి.

"ఏమంటాడు? అందరూ అనే మాటే అన్నాడు! అప్లికేషన్ ఫారం పంపుకోటానికి పదిరూపాయల ఫీజు కట్టలేనివాడివి ఐదు సంవత్సరాల కోర్సు ఎట్లా చదువుతావు అన్నాడు!" విశ్వనాథం నీరైపోయి దిగులుగా "ఇక అసలు ఏదీ చదవను మానుకుంటాను!" అన్నాడు.

"పిచ్చి సన్నాసి! లే! ఎందుకు దిగులు పడతావ్! వెళ్ళాం పద! నేను స్వయంగా వస్తే పింఛను డబ్బు యివ్వాళే ఇస్తారు. ఇవ్వాళ ఫస్టుగాదూ! అక్కడే చలాను పూర్తిచేసి ట్రెజరీలో డబ్బుకట్టి అప్లికేషను పంపుకోందువుగాని!" లేని ఓపిక తెచ్చుకొని మంచంమీద కూర్చున్నాడు శేషయ్య.

విపరీతమైన దగుతెర వచ్చింది—శరీరం అంతా చెమటతో ముద్దయిపోయింది.

పదిహేను నిముషాల తర్వాత తెప్పరిల్లుకొని - "రిక్షా పిలువ్!" అన్నాడు శేషయ్య.

"వద్దు నాన్నా! నువ్వు రాలేవు! కదల కూడదు!" అన్నాడు కొడుకు.

"ఫరవాలేదులే! ముందు నువ్వు రిక్షా పిలువ్!" శేషయ్య ముఖంలో ఏనాడూ లేని గంభీరత కనిపించింది.

"అయ్యో రాత! అట్లావుండి, మీ రెట్లా వెళ్తారండీ?" అన్నది భార్య ఆదుర్దాగా.

"నువ్వు ఊరుకోవే! ఊ! పోయి రిక్షా పిలవరా?" శేషయ్య గొంతుక వణికింది. తండ్రి కళ్ళలోని తీవ్రతా, పట్టుదలా చూసి విశ్వనాథం నోరు మెదపలేకపోయాడు.

తల్లీ కొడుకూ సాయంచేసి శేషయ్యను రిక్షా ఎక్కించారు.

రిక్షా సాగింది. చక్రంపక్కనే కొడుకు నడుస్తున్నాడు. రిక్షా మలుపు తిరిగి జిల్లా ట్రెజరీ ఆఫీసుగోడ్డు ఎక్కిపోతూంది.

ముప్పై సంవత్సరాల సర్వీసు చేసి రిటైరయిన శేషయ్య ప్రతినెలా పెన్షన్ తాలూకు ఏభై నాలుగు రూపాయలు తీసుకోవాలంటే ముందు తను బతికున్నట్టు ప్రతినెలా ట్రెజరీ ఆఫీసరుముందు రుజావు చేసుకోవాలి. తను స్వయంగా పోయి మొదటి తారీఖున హాజరయి జరిగిన నెలంతా బతికివున్నట్టు చెప్పుకోవాలి! లేకపోతే గవర్నమెంటు గుర్తించిన ఒక డాక్టరుచేత పెన్షనర్ బతికున్నట్టు సర్టిఫికెట్ తీసుకొని కుటుంబం తాలూకు మనిషి వెళ్తే పింఛను డబ్బు ఇస్తారు. ఐతే మూడు నాలుగు రోజుల తర్వాతగాని డబ్బు రాదు. ఆ సర్టిఫికెట్ పదిమంది గుమాస్తాల చేతులు మారి నలుగురు ఆఫీసర్ల సంతకం వేయించుకోవాలి. అదంతా యన్. జి. వో.లకు ప్రభుత్వం పెట్టిన పెన్షన్ రూల్సు.

—అవన్నీ శేషయ్యకు క్షుణ్ణంగా తెలుసు! రూల్సు అంటే రూల్సే! మరి గవర్నమెంటుతో పని! మాటలా?

తనుపోయి ట్రెజరీ ఆఫీసరుగారికి అలా కనిపిస్తే చాలు! వెంటనే డబ్బు ఇచ్చేస్తారు. ఒంటిగంటముందే చలానా కట్టుకొని ఫారము పంపుకోవచ్చు.

అదృష్టం బాగుండి సీటు వస్తే, ఆ ఎకరం పొలం అమ్మేస్తే రెండు సంవత్సరాలు చదువుకుంటాడు. ఆతర్వాతి సంగతి తర్వాత చూసుకోవచ్చు! బాగావున్నవాళ్ళెవరో ఒకరు పిల్లనిచ్చి, అల్లుణ్ని చదివించుకొంటారు. తనకొడుకు - విశ్వనాథం - డాక్టర్ విశ్వనాథం - ప్రతిభావంతుడైన డాక్టరవుతాడు! గొప్ప సర్జన్.

రిక్షా ఆగినచప్పుడుకు శేషయ్య తన వూహాప్రపంచంలోనుంచి బయటబడ్డాడు.

"నాన్నా! ఆ మెట్లన్నీ ఎక్కి లోపలకు రాగలవా?" అన్నాడు విశ్వనాథం కలక్టరాఫీసు మెట్లు చూపిస్తూ.

శేషయ్య రిక్షా దిగటానికి ప్రయత్నించి గబుక్కున గుండెమీద చెయ్యివేసుకొని మళ్ళీ రిక్షాలోనే కూలబడ్డాడు.

"విశ్వం! బాబూ! ఆఫీసరుగారితో చెప్పు నేవచ్చాననీ! నా పరిస్థితీను! వచ్చి చూస్తారు! ఊఁ. తొందరగా - తొందరగా పో!" శేషయ్య హీనస్వరంతో అన్నాడు. విశ్వనాథం రయ్యిన మెట్లెక్కి ట్రెజరీ ఆఫీసరుగదిలోకి వెళ్ళాడు.

పదినిముషాల తర్వాత ఆఫీసరుగారూ ట్రెజరీగుమస్తా విశ్వనాథమూ బయటికి వచ్చారు.

శేషయ్య కూర్చున్న సైకిల్ రిక్షాదగ్గర కొచ్చి ఆఫీసరుగారు శేషయ్యముఖంలో ముఖంపెట్టి చూసి గాబరాగా వెనక్కి తిరిగి విశ్వనాథంవంక చూశాడు.

విశ్వనాథం వొక్కదూకులో రిక్షాదగ్గరకొచ్చి తండ్రిని రెండుచేతులతోనూ పట్టుకొని వూపుతూ పిలిచాడు -

"నాన్నా!" గావుకేక పెట్టాడు విశ్వనాథం.

ట్రెజరీఆఫీసులోని ఖజానా పెట్టె, కలక్టరాఫీసుభవనమూ విశ్వనాథం పిలుపును ఆలకించి ప్రతిధ్వనించినై. ★